క్లుప్తంగా

జాకీర్ హుస్సేన్ మృతి తీరని లోటు

ప్రొద్దుటూరు : ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ మృతి తీరనిలోటని సేవ్ చైల్డ్ ప్రాజెక్టు డైరెక్టర్ తుపాకుల రామాంజనేయరెడ్డి సోమవారం తెలిపారు. 2020 ఫిబ్రవరి 16న బెంగళూరులో జాకీర్ హుస్సేన్‌ను కలిసి ఆయన చిత్రాపటాన్ని బహుకరించినట్లు రామాజంనేయరెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆయన హిందుస్థానీ క్లాసికల్ మ్యూజిక్, జాజ్ ఫ్యూజన్‌లో నైపుణ్యం ఆధించి తనదైన ముద్ర వేశారని తెలిపారు.

నియామకం


షేక్ మున్ని

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు చెందిన షేక్ మున్నిని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ సంస్థ జిల్లా మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా నియమించినట్లు సంస్థ ఫౌండర్, నేషనల్ చైర్మన్ జీపీ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. తనను నియమించిన సంస్థ ఫౌండర్, నేషనల్ చైర్మన్ జీపీ నరసింహులుకు ఈ సందర్భంగా షేక్ మున్ని ధన్యవాదాలు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో మానవహక్కులపై అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను చైతన్యం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

చాపాడు: దేవాలయాల పరిరక్షణ కోసం జనవరి 5న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విశ్వ హిందూ పరిషత్ ప్రముఖ్ మల్లికార్జున పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం వద్ద సోమవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ.. రాష్ట్రంలోని దేవాలయాల పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, భవానీ శంకర్, మనోహర్‌రెడ్డి, హజరత్‌రెడ్డి, సుబ్బయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

31 లోపు వడ్డీ లేకుండా పన్నులు


కమిషనర్ శ్రీనివాసులరెడ్డి

మైదుకూరు : ఈనెల 31 లోపు వడ్డీ లేకుండా పన్నులను స్వీకరిస్తామని మైదుకూరు మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై మున్సిపల్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. డిసెంబర్ తర్వాత వడ్డీతో కలిపి పన్నులను చెల్లించాల్సి ఉంటుందన్నారు. పన్ను బకాయిదారులందరూ అన్ని రకాల పన్నులను ఈ నెలాఖరులోపు తప్పక చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని సచివాయాల్లో పన్నుల వసూళ్ల కోసం కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అంతేగాకుండా ఆన్‌లైన్, ఫోన్‌పే ద్వారా కూడా చెల్లించవచ్చని కమిషనర్ చెప్పారు.

రేపు అవధూత నారాయణరెడ్డి ఆరాధనోత్సవాలు



మైదుకూరు : మండలంలోని సుంకులుగారిపల్లెలో బుధవారం అవధూత సద్గురు అట్ల సాధు నారాయణరెడ్డి స్వామి 29వ వార్షిక ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని శ్రీ మదచల పీఠ బృందావన ఆశ్రమంలో జరిగే ఉత్సవాల్లో మధ్యాహ్నం ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్సవాల్లో పెద్ద ఎత్తున గురుపుత్రులు పాల్గొనాలని కోరారు.

నేడు, రేపు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళ, బుధవారాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి వీరకిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి వీఆర్‌ఓలు, సర్వేయర్‌లు, ఏఎన్‌ఎంలు, జీఎంఎస్‌కే, ఎనర్జీ అసిస్టెంట్లు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 35 రోజులపాటు శిక్షణా కాలం ఉంటుందని, శిక్షణలో భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 9000487423 నెంబరులో సంప్రదించాలన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జికి తుది మెరుగులు

- రూ.50 కోట్లతో నిర్మాణం
- ప్రారంభం కాని అప్రోచ్ రోడ్డు పనులు


ప్రొద్దుటూరు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వాహనాల ట్రయల్ రన్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంలోని జమ్మలమడుగు రోడ్డులో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. త్వరలో బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు రూ.50 కోట్లతో బ్రిడ్జిని నిర్మించారు. పూర్వం ప్రొద్దుటూరుకు రైల్వే స్టేషన్ లేదు. నంద్యాల ఎర్రగుంట్ల రైల్వే నిర్మాణానికి దశాబ్దాల సమయం పట్టింది. స్టేషన్ నిర్మాణం అనంతరం కొన్నేళ్ల క్రితం గూడ్స్ రైలు నడిపారు. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తర్వాత నంద్యాల – ఎర్రగుంట్ల మధ్య ప్యాసింజర్ రైలు నడిపారు. మళ్లీ ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటు చేయగా, ప్రస్తుతం గుంటూరు – తిరుపతి మధ్య రైలును నడుపుతున్నారు. రాళ్ల ట్రాఫిక్ పెరగడంతో ప్రొద్దుటూరు మండలంలోని కొత్తపేట వద్ద క్రాసింగ్ గేట్‌ను తరచూ వేస్తున్నారు. ఈ గేట్ నెల్లూరు – ముంబాయి జాతీయ రహదారిపై ఏర్పాటు చేశారు. తరచూ గేట్ వేయడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూ.50 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేసింది. గత ఐదేళ్లుగా జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రస్తుతం పూర్తయ్యాయి.

ట్రయల్ రన్

ఇటీవల బ్రిడ్జికి ఒక వైపున ట్రయల్ రన్ నిర్వహించారు. త్వరలో బ్రిడ్జిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పూర్తికాని అప్రోచ్ రోడ్డు నిర్మాణం

రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగలేదు. నెల్లూరు – ముంబై జాతీయ రహదారి నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం పూర్తయ్యాయి. అయితే భూ సేకరణ సమస్య కారణంగా మండలంలోని శంకరాపురం – రైల్వే ఓవర్ బ్రిడ్జి మధ్య పనులు నిలిచిపోయాయి. కొందరు యజమానులు కోర్టును ఆశ్రయించడంతో పనులు ఆగిపోయాయి. యథావిధిగా రోడ్డు నిర్మాణ పనులు జరపాలని ప్రభుత్వానికి అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 2013 నాటి అంచనాల ప్రకారం రైతులకు డబ్బు చెల్లించాలని రెవెన్యూ అధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకు ఈ పనులకు సంబంధించి పురోగతి లేదు. నిబంధనల ప్రకారం జాతీయ రహదారి నిర్మాణం అసంపూర్తిగా కాకుండా పూర్తయి ఉంటే రైల్వే ఓవర్ బ్రిడ్జికి అనుసంధానంగా ఉండేది. ప్రస్తుతం పెద్ద శెట్టిపల్లె గ్రామంలో నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వీలైనంత త్వరగా ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో బ్రిడ్జి ప్రారంభం

త్వరలో రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నేషనల్ హైవే జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం


పూర్ణాహుతి సమర్పిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం, ఆలయ చైర్మన్ రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఘనంగా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామి మూలవిరాట్‌కు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకళ్యాణార్థం గోపూజ, గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలను వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమంలో డీఎస్పీ భక్తవత్సలం సతీసమేతంగా పాల్గొని హోమం చేశారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు వెల్లువ

బ్రహ్మంగారిమఠం: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలకు అర్జీలు భారీగా అందుతున్నాయి. మండలంలో 14 గ్రామ సచివాలయాల పరిధిలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. సోమవారం సోమిరెడ్డిపల్లె– 3 సచివాలయం పరిధిలోని నరసన్నపల్లెలో తహసీల్దార్ దామోదర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సభకు గంగిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, ఆశ్రమం, బి.మఠం నుంచి రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం 150 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీటీ, సర్వేయర్, వీఆర్‌ఓలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముదుమాలలో..

రెవెన్యూ గ్రామ సభలలో భాగంగా మంగళవారం ముదుమాల గ్రామ సచివాలయ పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామ సభ నిర్వహించనున్నట్లు డీటీ జాన్స్ తెలిపారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్



మాట్లాడుతున్న ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు వెంకటరెడ్డి

కలసపాడు : ఉద్యోగ, ఉపాధ్యాయులు అత్యవసరాల నిమిత్తం పొదుపు చేసుకున్న సొమ్మును చెల్లించకుండా నెలలు, సంవత్సరాల తరబడి పెండింలో ఉంచడం అన్యాయంఞ పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు సి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.ఎస్.వి. ప్రసాద్ డిమాండ్ చేశారు. పీఎఫ్, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఆయాల జీతాలు సీసీహెచ్ తదితర బిల్లుల చెల్లింపులో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం కలసపాడులో జరిగిన ఎస్టీయూ సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ జీతాల నుంచి ప్రతి నెల మినహాయించి వారి ఖాతాల్లో పొదుపు చేసుకున్న సొమ్మును తీసుకోవాలన్నా నెలలు, సంవత్సరాల తరబడి ఎదురుచూసి ఇబ్బందులకు గురికావడం ఇటీవల కాలంలో చూస్తున్నామన్నారు. సకాలంలో డబ్బులు అందక వివాహాలు లాంటి అత్యవసర కార్యక్రమాలను కూడా వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. పాఠశాలలు తెరిచి ఏడు నెలలు అవుతున్నా ఇంత వరకు పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ నెలాఖరులోగా పెండింగ్ బిల్లులను చెల్లించకపోతే ఉద్యమ కార్యాచరణకు పిలుపునిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శేఖర్‌బాబు, అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సత్యనారాయణ, మహిళా కమిటీ కన్వీనర్ కవితశివారెడ్డి, బాలచెన్నయ్య, బాలరాజునాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నిలుపుకోవాలి


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ, డీహెచ్‌పీఎస్, డీడీకేఎస్ నాయకులు

అట్లూరు : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలుపుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి.వీరశేఖర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు నాగదాసరి ఇమ్మానుయే పేర్కొన్నారు. సోమవారం దళితహక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్), ఏపీ గిరిజన సమాఖ్య, దళిత డప్పు కళాకారుల సంఘం (డీడీకెఎస్)ల ఆధ్వర్యంలో బద్వేలు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇంటి స్థలాలు, భూములు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక దానిని విస్మరించడం దారుణమన్నారు. నియోజకవర్గంలో వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతం అయినప్పటికీ ఎక్కడా కూడా స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవన్నారు. కేవలం రెవెన్యూ సదస్సులు పెట్టి మమ అనిపించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారే తప్ప పేదలకు న్యాయం జరగడం లేదన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలందరికి రెండు ఎకరాల సాగు భూమి మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, నియోజకవర్గ నాయకులు ఎం.ప్రసాద్, డీడీకెఎస్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి మస్తాన్, ఏరియా కార్యవర్గ సభ్యులు బాలు, జాకోబ్, కేశవ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


వధూ వరులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణవేణిల కుమారుడు విజయమునిరెడ్డి, దత్త మధు తులసిల వివాహం రిసెప్షన్ సోమవారం స్థానిక రాయల్ కౌంటీలో ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని వధూ వరులను ఆశీర్వదించారు. మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లలో ఉద్యోగాలు సాధించారు. వైజాగ్‌కు చెందిన టాలెంట్ ల్యాబ్ వారు బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్ ఉద్యోగాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలో 10 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వినయ్‌కుమార్, సంధ్య, సైఫుల్లా, దినేష్, కౌసర్‌నయీమ్, శరణ్య, అజీజ్ మహ్మద్, షేక్ గౌబున్నీసా, అబ్దుల్లా ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని ఏడాదికి రూ.4లక్షల నుంచి రూ.7లక్షల వరకు వేతనం ఉంటుందని ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు, కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, టీపీఓ సునీల్, అధ్యాపకులు అభినందించారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన


సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. రామేశ్వరంలోని ఆణ బంకు వద్ద మూడో డివిజన్ పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్‌ను కమిషనర్ పరిశీలించారు. గాంధీ పార్కును సందర్శించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి సూచనలను చేసి సమయానికి పార్కును తెరవాలని ఆయన ఆదేశించారు. ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, దేవాంగపేట, శ్రీరామ్‌నగర్ వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. విజయనగరం వీధిలో కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్య కార్మికులతో తీయించారు. చెత్త సేకరణ, మంచినీటి సరఫరా, వీధి దీపాల సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.గోవిందరెడ్డి, ఎస్.నూర్‌బాషా పాల్గొన్నారు.

జమ్ము తావి - హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు : జమ్ము తావి – హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ జిల్లాలో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని ప్రజా పక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కడప రైల్వే స్టేషన్ మేనేజర్ సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం జమ్ము తావి – హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ తిరుపతి నుంచి బయల్దేరి కడప జిల్లాలో ఏ రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేయకుండా అనంతపురం జిల్లా గుంతకల్‌లో స్టాప్ చేయడం వల్ల జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌ను కడప రైల్వేస్టేషన్‌లో కానీ, ఎర్రగుంట్ల రైల్వేషన్‌లో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ నాయకులు ఎస్.రాము, ఎం.ఓబుళరెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కత్తెరగండ్ల శివాలయం పునర్నిర్మాణం

కాశినాయన : మండలంలోని కత్తెరగండ్ల శివాలయాన్ని పునర్నించేందుకు గత ప్రభుత్వంలో దేవదాయశాఖ ద్వారా రూ.80 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలోనే మూడు రోజుల పాటు పూజలు చేసి అక్కడ ఉన్న శివలింగాన్ని తొలగించి బాలమందిరంలో పెట్టారు. శివాలయంలోని శివలింగం, నందీశ్వరుడు, విఘ్నేశ్వరుని ప్రతిమలను తొలగించారు. సోమవారం గుడిని పగులకొడుతున్నట్లు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో వారి సమక్షంలో పురాతన ఆలయాన్ని పగులకొట్టారు. దాని స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మలుపు వద్ద కంపచెట్లు తొలగింపు


జేసీబీతో కంపచెట్లను తొలగింపజేస్తున్న ఎస్ఐ కత్తి వెంకటరమణ

రాజుపాళెం : ప్రొద్దుటూరు – ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో మండలంలోని వెంగళాయపల్లె గ్రామ సమీపంలో ప్రమాదకరమైన మలుపు వద్ద రాజుపాళెం ఎస్ఐ కత్తి వెంకటరమణ కంపచెట్లను సోమవారం సాయంత్రం తొలగింపజేశారు. ఆ మలుపు వద్ద కంపచెట్లు పెరగడంతో ఎదురుగా ఏ వాహనాలు వస్తున్నాయో తెలియకపోవడంతో ప్రమాదాలు జరుగుతుండేవి. సమస్యను గుర్తించిన ఎస్ఐ ఏపుగా పెరిగిన కంపచెట్లను జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కంపచెట్లను తొలగించడంతో ఆదారిలో ఉన్న వాహనదారులు ఎస్ఐ, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- ఎంఆర్‌టీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి

కడప కార్పొరేషన్: ప్రకృతిసిద్ధంగా తలెత్తే విపత్తులను తగిన భద్రతతో సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎంఆర్‌టీ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఎన్‌పీటీఐ ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్‌పీటీఐ డైరెక్టర్ కె. ముత్తుకుమార్, రిటైర్డ్ ఈఈ వెంకట రమణలతో పాటు ఈఈ రమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వ అధికార మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో నేషనల్ పవర్ ట్రెనింగ్ ఇన్సిట్యూట్ వారు 'కార్యాచరణ భద్రత, విపత్తు నిర్వహణ' శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ శిక్షణ కొనసాగనుందన్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది శ్రద్ధగా శిక్షణను తీసుకొని విధి నిర్వహణలో ఎదురయ్యే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ క్రిష్ణదేవ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికోద్యోగులు, ఎన్‌సీసీ విద్యార్థులు

అట్లూరు : దేశ రక్షణ కోసం అమరవీరులు అందించిన త్యాగాలు మరువలేనివని విశ్రాంత సైనికోద్యోగుల సంఘం అధ్యక్షులు కోనేటి రామకృష్ణయ్య, ఉపాధ్యక్షులు మూర్తిపెంచలయ్య, విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. విజయ్ దివస్‌ను పురస్కరించుకుని సోమవారం బద్వేలు పట్టణం పోరుమామిళ్లరోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద మాజీ సైనికోద్యోగుల సంఘం, రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా అమరవీరులకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారతదేశం విజయం సాధించడంతో పాటు, డిసెంబర్ 16న పాకిస్తాన్ సైన్యం భారతదేశానికి లొంగిపోయిందన్నారు. ఆ తేదీని భారత ప్రభుత్వం విజయ్‌దివస్‌గా ప్రకటించి ప్రతి ఏటా అమరవీరులను స్మరించుకోవడం జరుగుతోందన్నారు. దేశ సరిహద్దుల్లో ఎంతో మంది సైనికులు ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తుండడంతోనే మనమంతా స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామన్నారు. అటువంటి మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు, యువత ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సైనిక సభ్యులు శ్రీనివాసులు, ఎం.కృష్ణఫర్, రామిరెడ్డి, మనోజ్, మహనీయుల ఆశయసాధన సమితి నాయకులు గురుమూర్తి, కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు విముక్తి


పశువుల షెడ్డుకు అడ్డంగా పాతి బండలను తొలగింపజేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని నంగనూరుపల్లె గ్రామంలో ఈనెల 11వ తేదీ నుంచి తన గేదెలు, ఆవులు తమ దాయాదుల గొడవలతో బంధించబడ్డాయని మేకల చెన్నమ్మ అనే వృద్ధులు తహసీల్దార్ గంగయ్య, రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీలకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు స్పందించిన తహసీల్దార్, రూరల్ ఎస్ఐ సోమవారం మధ్యాహ్నం ఆ గ్రామానికి వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించారు. మూగ జీవాలు బయటికి రాకుండా అడ్డుగా బండలు పాతి అమానుష చర్యలకు పాల్పడిన వారిపై తహసీల్దార్ మండిపడ్డారు. గ్రామంలో ఇంతటి అమానుషమైన చర్య జరుగుతున్నప్పటికీ తనకు గానీ, పోలీసులకు తెలపకపోవడంపై వీఆర్‌ఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట వీరిపైనే చర్యలు తీసుకోవాలన్నారు. బండలు నాటిన వారిని పిలిపించి బండలు తొలగించాలని ఆదేశించారు. వారు అంగీకరించకపోవడంతో తహసీల్దార్ వారిపై అనిమల్ క్రూయల్టీ యాక్ట్ 1960 ప్రకారం క్రిమినల్ కేసులను నమోదు చేయాలని అక్కడ ఉన్న ఎస్ఐని ఆదేశించారు. ఎన్ని గొడవలు ఉన్నా ఇలా మూగ జీవాలను హింసిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి వీఆర్‌ఓ హర్ష, సర్వేయర్ సయ్యద్ మహ్మద్ యూసఫ్, సిబ్బంది నరేష్‌లతో కలసి బండలను తొలగించారు. అనంతరం సర్వేయర్‌తో గొడవలకు కారణమైన స్థలాన్ని సర్వే చేయించారు. వివాదానికి కారుణమైన స్థలం కాలువ పోరంబోకు స్థలంగా గుర్తించారు. పోరంబోకు స్థలంలో ఉన్న ఇళ్లను కూల్చేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ఈనెల 11న జరిగిన ఘటనపై బాధితురాలు మేకల చెన్నమ్మ కుమారుడు శ్రీనివాసులును బండలు నాటిన నాగార్జున, వెంకటశివ, వెంకటసుబ్బయ్యలు దాడి చేసి గాయపరిచారని, వీరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ మహ్మద్ రఫీ తెలిపారు. ఈ కేసులోని మరో ముగ్గురు పరారిలో ఉన్నారని వారిని కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

అన్నప్రసాదం వితరణ


అన్న ప్రసాదం వడ్డిస్తున్న శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, ఆయన భార్య కవిత, కుమారుడు ధీరజ్ రామిరెడ్డి, కోడలు గీతా మౌనిక, కుటుంబ సభ్యుల సహకారంతో అన్నప్రసాద సేవా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 800 మంది అన్నప్రసాదం స్వీకరించినట్లు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గత మూడేళ్లుగా ప్రతి సోమవారం దాతల, ప్రజల సహకారంతో అన్నప్రసాద సేవా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం కమిటీ ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణునారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ, ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సోమవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ పట్టణ గౌరవాధ్యక్షుడు బి.రామయ్య వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ వాహనాల కార్మికులపై భారీ జరిమానాలు విధించే జీఓ నంబర్ 21, 31లను రద్దు చేయాలని తెలిపారు.

ఆటో ట్రక్కు, ఆటో, కారు డ్రైవర్లకు వాహన మిత్ర రూ.15వేలు చెల్లించాలని, ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వారికి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్టీఓ, పోలీసుల చలానాలను రద్దు చేయాలని, జిల్లా ఆర్‌అండ్‌బీ రోడ్లపై టోల్‌గేట్లు పెట్టే ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. నగరాల్లో ఓలా, ఉబర్, రాపిడ్ వాహనాలకు ఇచ్చిన అనుమతులను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేఇన 894 గెజిట్ నోటిఫికేషన్ 2023 సీఆర్‌పీసీ 106 (1)(2) నూతన మోటార్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు మచ్చ శ్రీను, ఎల్లయ్య, ఎస్.హరిబాబు, సుధాకర్, వెంకటసుబ్బయ్య, నరేష్, చిన్న, గుర్రప్ప, రాజేష్, సుభాన్, ఖాదర్, గౌస్, దస్తగిరి, శివ, రమణ, చిన్న గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.